మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

● రైతులెవరూ ఆందోళన చెందవద్దు

● దళారులకు అమ్మి మోసపోవద్దు ● కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, మే 28(నమస్తే తెలంగాణ) : రైతులు కష్టపడి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరను కల్పించి కొనుగోలు చేస్తామని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా జిల్లాలోని చాలా చోట్ల కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడిసిపోయిందన్నారు. కొనుగోళ్లపై రైతులు అపోహలకు లోనుకావద్దని, తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కొంతమంది రైతులు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనదేమోనని ఆందోళనకు గురై దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే అమ్ముకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతులు ఎవరు కూడా తొందరపడి తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని సూచించారు. 19 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నదని, వచ్చే వారం పది రోజుల్లో మిగిలి ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా చూస్తామన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీ

ట్రిపుల్ ఐటీ పిలుస్తోంది

2025-26 విద్యాసంవత్సరం నోటిఫికేషన్ విడుదల

● ఆరేండ్ల జీటెక్ సమీకృత కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం ● 31వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరణ

● జూలై 4న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల ● మహబూబ్‌నగర్‌లో మరో ట్రిపుల్ ఐటీ ● ఈ ఏడాది 180 సీట్లు

బాసర, మే 28 : రాజీవ్‌గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) పరిధిలోని బాసర ట్రిపుల్ ఐటీ 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను ట్రిపుల్ ఐటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ బుధవారం విడుదల చేశారు. ఆరేళ్ల సమీకృత కోర్సులో చేరేందుకు అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను జూలై 4న విడుదల చేయనున్నారు. ఈ సంవత్సరం మహబూబ్‌నగర్‌లో మరో ట్రిపుల్‌ఐటీని ఏర్పాటు చేయగా.. ఇందులో 180 సీట్లతో భర్తీ చేయనున్నారు. బాసరలో 1500 సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నారు. దీనిపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం

ప్రవేశ అర్హతలు

- 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిసెంబర్ 31, 2025 నాటికి 18 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు 21 ఏళ్లు నిండకూడదు.

రిజర్వేషన్‌లు..

ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు ఆరు శాతం, బీసీఏ ఏడు శాతం, బీసీబీ పది శాతం, బీసీసీ ఒక శాతం, బీసీడీ ఏడు శాతం, బీసీఈ నాలుగు శాతం. ప్రత్యేక కేటగిరీలో వికలాంగులకు ఫ్రీ, సైనిక ఉద్యోగులకు ఒక శాతం, స్పోర్ట్స్ కోటా కింద 0.5 శాతం భర్తీ చేయనున్నారు.

దరఖాస్తు చేసుకోండి..

- దరఖాస్తులను మీ సేవా కేంద్రాల్లో అడ్మిషన్స్ admissions@rgukt.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఓసీ, బీసీ అభ్యర్థులకు అప్లికేషన్ ఫీజు రూ.500, ఎస్టీ, ఎస్టీలు రూ.450 చెల్లించాలి.
- గ్లోబల్ కేటగిరీలో దరఖాస్తు చేసుకునేవారు రూ.1500ల ఫీజు చెల్లించాలి.

ట్రిపుల్ఐటీలో చదువుతున్న విద్యార్థులు

ఈ ఏడాది ఫీజులు పెరగనున్నాయా?

రాష్ట్రంలోని పాఠశాలల్లో చదివిన విద్యార్థులు రూ.36 వేలు చెల్లించాలి. ఫీజ్ రియింబర్స్‌మెంట్‌కు అర్హులైన వారు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇతర నేషన్, గల్ఫ్ దేశాల్లో చదివిన వారు ఏడాదికి రూ.1.36 లక్షలు, ఎన్ఆర్ఐ విద్యార్థులకు రూ.3.01 లక్షలు చెల్లించాలి. కాగా.. ఈ ఏడాది ఫీజులు పెంచాలని ట్రిపుల్ ఐటీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇంకా వాటిపై స్పష్టత లేదు.

కౌన్సెలింగ్‌లో సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాలు

ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించేటప్పుడు ఇచ్చిన రసీదు. మార్కుల లిస్టు, నివాస సర్టిఫికేట్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులైతే వైకల్య నిర్ధారణ సర్టిఫికెట్, సైనికోద్యోగుల పిల్లలు అయితే సంబంధిత అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం,ఎస్‌సీసీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులైతే వాటికి సంబంధించిన అధికారి జారీ చేసి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.

రాష్ట్రంలో మరో ట్రిపుల్ ఐటీ

తెలంగాణ రాష్ట్రంలో మరో ట్రిపుల్ ఐటీ మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు కానుంది. 2025-26 విద్యా సంవత్సరానికి విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల నోటిఫికేషన్‌లో బాసర ట్రిపుల్ ఐటీలో 1500 సీట్లకు ప్రవేశాల కల్పించనుండగా, కొత్తగా ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీలో 180 సీట్లకు ప్రవేశాలను కల్పించనున్నారు.

ఈసారి మార్కుల ఆధారంగా..

ట్రిపుల్ ఐటీ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను సీజీపీఏ ద్వారా ఎంపిక చేసేవారు. కాగా.. ఇప్పుడు ప్రభుత్వం పదో తరగతి విద్యార్థుల మార్కులను కేటాయించడంతో ఈ విద్యా సంవత్సరంలో మార్కులతో మెరిట్‌ను ఆధారం చేసుకుని సీట్లను కేటాయించనున్నారు. ఇద్దరికి ఒకే మార్కులు వస్తే సంబంధిత కేటగిరీల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు సంబంధిత కేటగిరీలో విద్యార్థుల మార్కులు ఒక్కటైతే వరుసగా గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో అధిక మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. ఇవన్నీ సమానంగా ఉంటే విద్యార్థి పుట్టిన తేదీ ప్రకారం.. ఎవరు పెద్దవారయితే వారికి సీటు కేటాయించనున్నారు. ఇవీ కూడా సమానంగా ఉంటే పదో తరగతిలో విద్యార్థి హాల్ టికెట్ నంబర్, రాండమ్‌లో ఎవరికి తక్కువగా ఉంటే వారిని ఎంపిక చేస్తారు.

ఈ సారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 24 మార్కులు అదనంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు, నాన్ రెసిడెన్షియల్ పాఠశాల, జెడ్పీ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్, సాంఘీక సంక్షేమ మోడల్ స్కూల్‌లో చదివిన విద్యార్థులకు 0.4 జీపీఏ వేయిటేజీ ఇచ్చేవారు. కాగా ఇప్పుడు ప్రభుత్వం పదో తరగతి వారికి మార్కులు కేటాయించడంతో వీరికి 24 మార్కులు అధనంగా కలపనున్నారు.

ప్రవేశాల షెడ్యూల్..

- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం మే 31 ● దరఖాస్తులకు చివరి తేదీ జూన్ 21 ● పీహెచ్/ఎన్‌సీపీ/ స్పోర్ట్స్ విద్యార్థులు దరఖాస్తు చేసిన హార్డ్‌కాపీలను పంపించేందుకు చివరి తేదీ జూన్ 25
- జాబితా విడుదల జూలై 4
- ఫేజ్-1 కౌన్సెలింగ్ జూలై 7

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

విద్యార్థులు admissions@rgukt.ac.in వెబ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

మాట్లాడుతూన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

వన మహోత్సవాన్ని సక్సెస్ చేయాలి

ఎదులాపురం, మే 28 : వన మహోత్సవ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. వన మహోత్సవం 2025 సీజన్‌లో ప్లానింగ్, ఇందిర సౌరగిరి జల వికాసం, పీఎం జన్‌మన్, డీఏ జుగువాలపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్‌లు కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. వన మహోత్సవ కార్యక్రమాన్ని 2025 జూన్ మొదటి వారంలో ప్రచార రీతిలో సామూహిక చెట్ల పెంపకం చేపట్టాలన్నారు. మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి, ఆ ప్రదేశాలు టీజీఎఫ్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో జియో-కో-ఆర్డినేట్‌లతో నమోదు చేయాలన్నారు. మున్సిపల్ ఏరియాలో ప్రతి ఇంటికి ఐదు మొక్కలు అందజేయాలని, వాల్టా నియమాన్ని పాటించాలన్నారు. వనమహోత్సవ సమయంలో మొక్కలు నాటడం ద్వారా సాధించిన విజయాన్ని టీజీఎఫ్ఎంఐఎస్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈత, ఖర్జూర, ఇప్ప మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉంచాలని డీఆర్‌డీఏను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వినోద్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

ఎదులాపురం, మే 28 : ఆదిలాబాద్ జిల్లాలో వర్షాల దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఉట్నూర్ సబ్ డివిజనల్ అధికారులతో నెలవారి నేరసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తమై పోలీస్ స్టేషన్‌లో ఉండాలని సూచించారు. రైతులు మోసపోకుండా నకిలీ విత్తనాలను చలామణిలో లేకుండా కఠినమైన చర్యలను తీసుకోవాలని తెలిపారు. చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బంది గ్రామగ్రామాన సందర్శిస్తూ పోలీసు మీ కోసం కార్యక్రమాలను నిర్వహిస్తూ విలేజ్ పోలీస్ ఆఫీసర్ ఆవశ్యకతపై వివరణ ఇవ్వాలన్నారు. అదనపు ఎస్పీ సురేందర్‌రావ్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఐపీఎస్, డీఎస్పీలు శ్రీనివాస్, నాగేందర్, సీఐలు రహీం పాషా, మొగిలి, రాజు, పండే రావ్, గుణవంత్ రావ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు వెంకటి, మురళి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ జాతీయ రహదారి పక్కన ఆరబోసిన జొన్నలు

రేపే లాస్ట్ అన్నరూ.. జొన్న కొంటలేరు

ఆదిలాబాద్, మే 28(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. యాసంగిలో రైతులు పండించిన జొన్నను ఈ నెల 31 వరకు కొనుగోలు చేస్తామని అధికారులు రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఈ లోగా రైతులు తమ పంటను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి మద్దతు ధర క్వింటాలుకు రూ.3371తో విక్రయించాలని సూచించారు. 31వ తేదీ చివరిదిగా ప్రకటించి తర్వాత కొనుగోలు కేంద్రాలను మూసివేస్తామన్నారు. అధికారుల సూచనల మేరకు రైతులు పంటను విక్రయించడానికి తీసుకొస్తున్నారు. గన్నీ సంచుల కొరత, కాంటా చేసిన సంచులను లారీల్లో గోదాములకు తరలించడంలో జాప్యం కారణంగా రైతులు పంటను అమ్ముకునేందుకు నిరీక్షించాల్సి వస్తుంది. భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడలో ఐదు రోజుల నుంచి రైతులు పడిగాపులు కాస్తున్నారు. పంటలను కుప్పలుగా పోసి తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. వర్షంతో తడిసిన జొన్నలను ఆరబెడుతూ ఎప్పుడు కొంటారా? అని ఎదురు చూస్తున్నారు. అధికారులు స్పందించి తొందరగా పంటను కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

జొన్నలు తెచ్చి వారం అవుతుంది..

నేను 21 క్వింటాళ్ల జొన్నలను పిప్పర్‌వాడ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి వారం రోజులు అవుతుంది. రేపూ,మాపూ అంటూ కొనుగోలు కేంద్రాల సిబ్బంది కొంటలేరు. గన్నీ సంచులు లేవంటున్నారు. నాలుగు రోజుల నుంచి రోజు వర్షం పడుతుంది. పంట తడిసిపోకుండా కవర్లు కప్పుతున్నా ఫలితం ఉండడం లేదు. జొన్నలు పాడవకుండా రోజు పొద్దుగాళ్ల ఎండబెడుతున్నా. తిండి, తిప్పలు లేక పంటను అమ్ముకోవడానికి పడిగాపులు కాస్తున్నాం.

- సురేశ్, రైతు, పెండల్‌వాడ, భోరజ్ మండలం

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు చేయాలి

నిర్మల్ అర్బన్, మే 28 : బక్రీద్ పండుగకు ఏర్పాట్లను పూర్తి చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ.. పండుగకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, పరిశుభ్రత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతంలో అధికారులు చేపట్టిన పనులను ముస్లింలు వివరించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్ ఉన్నారు.

జాతీయ రహదారి పనులు అస్తవ్యస్తం

ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రికి అవగాహన లేదు

● యువకుడు గల్లంతవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కాంట్రాక్టరే కారణం ● వానకాలం ముందు పాత వంతెన ఎందుకు కూల్చారు?

● బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.50 కోట్లు వృథా అయ్యాయి.. ● మాజీ మంత్రి జోగు రామన్న మండిపాటు

ఆదిలాబాద్, మే 28(నమస్తే తెలంగాణ) :ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని తర్నం వంతెన ప్రవాహంలో లక్ష్మీపూర్‌కు చెందిన యువకుడు లాండే దత్తు(30) కొట్టుకుపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ కారణమని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేల మండలంలోని ఉపాసనా ల నుంచి భోరజ్ వరకు నిర్మిస్తున్న 363(బీ) జాతీయ రహదారి పనులు ఏడాది కిందట ప్రారంభమయ్యాయి. పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ముందుగా వంతెనలు నిర్మించాల్సి ఉండగా.. కాంట్రాక్టర్ రహదారి నిర్మాణం తర్వాత వంతెనలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తర్నం వద్ద పాత వంతెన ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు అనుకూలం గా ఉండగా.. ఇటీవల వానకాలం ముందు ఎందుకు కూల్చాల్సి వచ్చిందో ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రహదారి పనులు నిర్మాణం విషయం లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ, ఎ మ్మెల్యేలు ఇప్పటి వరకు ఒక్క సమావేశం నిర్వహించలేదని, అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించలేదన్నారు. నాణ్యత లేని ప నులు జరుగుతున్నా ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి సీతక్క ఎందుకు స్పందించడం లేదన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

రూ.4.50 కోట్ల నిధులు వృథా..

వాహనాల రాకపోకలకు రూ.4.50 కోట్లతో తాత్కాలిక వంతెన నిర్మించిన ప్రయోజనం లేదని, మంగళవారం కురిసిన వర్షానికి వంతెనపై నుంచి నీరు ప్రవహించి మోటార్ సైకిల్‌పై పోతున్న లాండే దత్తు ప్రమాదానికి గుపైనట్లు మాజీ మంత్రి రామన్న తెలిపారు. గతంలో తాము నిధులు లేకుండా మొరంతో నిర్మించిన వంతెన రాకపోకలకు ఉపయోగపడిందన్నారు. పాత వంతెన కూల్చిన ఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోడ్లను ఎమ్మెల్యే పాయల్ శంకర్ గడ్డపారతో తవ్వి శాంపిళ్లను నాణ్యత పరిశీలన కోసం క్వాలిటీ కంట్రోల్ అధికారులకు పంపించే వారని, ఇప్పుడు జాతీయ రహదారి పనుల విషయంలో ఎందుకు మాట్లాడడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లాండసాంగ్వీ మీదుగా రూ.40 కోట్లతో నిర్మించిన రహదారి వల్ల జైనథ్, బేల, మహారాష్ట్రవాసులకు వానకాలంలో రవాణా సౌకర్యం కలిగిందని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రౌతు మనోహర్, మార్నెట్టి గోవర్ధన్, తిరుపతి, బట్టు సంతోష్, సంతోష్ కల్చప్ రెడ్డి, మూర్య, సురేందర్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో వడ్లను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

సారంగాపూర్, మే 28 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం మండలంలోని జామ్, సారంగాపూర్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో మిగిలిన ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న హమాలీలతోపాటు ప్రతి కేంద్రంలో మరో 20 మందిని అదనంగా కూలీలకు సమకూర్చి ధాన్యాన్ని తరలించాలన్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు దిగులు చెందాల్సిన పని లేదన్నారు. జామ్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీకి వచ్చిన కలెక్టర్‌కు రైస్ మిల్లర్లు ధాన్యంలో కోత విధిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయడంతో వెంటనే అక్కడ నుంచి కలెక్టర్ రైస్‌మిల్లర్లతో ఫోన్ మాట్లాడారు. ధాన్యంలో కోతలు లేకుండా తూకం వేసి తక్షణమే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్, జిల్లా మేనేజర్ సుధాకర్, తహసిల్దార్ శ్రీదేవి పాల్గొన్నారు.

తర్నంలో లో లెవల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

తర్నం బ్రిడ్జి పరిశీలన

జైనథ్, మే 28 : ఉమ్మడి మండలంలోని తర్నం గ్రామ సమీపంలో గల సొత్నాలపై తాత్కాలికంగా నిర్మించిన లో లెవల్ బ్రిడ్జిని మాజీ మంత్రి జోగు రామన్న బుధవారం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లో లెవల్ బ్రిడ్జి కారణంగా ప్రజలు, ప్రయాణికులు వరదల్లో తమ ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన చెందారు. జైనథ్, బేల మండలాలతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర ప్రజలు ప్రయాణికులు జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌కు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యుద్ధ ప్రతిపాదికన బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల మాజీ ఎంపీపీ గోవర్ధన్, తర్నం మాజీ సర్పంచ్ బండి రాధిక, గజానన్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, మే 28 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు గిరిజన మినీ గురుకులాల్లో 1వ తరగతిలో మిగిలిన సీట్లకు మాత్రమే బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా మండలాలకు చెందిన వారే జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. లోకారి-కేలో 1వ తరగతిలో 30 సీట్లు, 5లో 18, బేల 1లో 30, 5లో 10, నేరేడిగొండ 1లో 30, 2లో 4, 5లో 8, మామడలో 1లో 30, 5లో 6 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆదిమ గిరిజన తెగలకు చెందిన కొలాం, తోటి, పీవీటీజీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. జూన్ 9న లక్కీడ్రా ద్వారా ఎంపిక ఉంటుందన్నారు.